సాక్షి
ఆదిలాబాద్
శనివారం । 3 । మే । 2025

DOST Online Degree Admissions

డిగ్రీ ప్రవేశాలకు వేళాయె..

తెలంగాణలో డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ నోటిఫికేషన్ విడుదలైంది. నేటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. మూడు విడతల్లో కొనసాగనుంది. 10లో▸



కలియదున్నితే భూసారం

వరి కొయ్యలు కాల్చితే వాతావరణ కాలుష్యంతోపాటు భూసారం దెబ్బతింటుంది. కొయ్యలను కలియదున్నాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
43.0/27.0

వాతావరణం

మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జనగణనతోపాటు కులగణన



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: దేశంలో జనగణనతో పాటు కులగణన సైతం ఎంతో ముఖ్యమైనదని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. కులగణనపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంపై జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వర్గాలకు లబ్ధి చేకూరేలా కుల గణన జరుగుతుందన్నారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, పట్టణ అధ్యక్షుడు వేద వ్యాస్, రవి, రవిరెడ్డి, భూమేశ్, రాకేశ్, సుభాష్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

లంచం డిమాండ్ చేస్తే ఏసీబీని ఆశ్రయించండి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీని ఆశ్రయించాలని ఏసీబీ డీఎస్పీ పి.విజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదిలాబాద్ ఏసీబీ కార్యాలయం మంచిర్యాలకు తరలిస్తున్న వార్తల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు. మంచిర్యాల, కుమురంభీం జిల్లాల ప్రజల సౌకర్యార్థం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొంత సిబ్బందితో మంచిర్యాల జిల్లాలోని సీసీసీ నస్పూర్‌లో అదనంగా మరో కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం ఉండదని పేర్కొన్నారు. ఏసీబీ కార్యకలాపాలు జిల్లాలో యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నం.1064, డీఎస్పీ విజయ్‌కుమార్ సెల్: 9154388963, ఇన్‌స్పెక్టర్ ఎస్.కిరణ్‌రెడ్డి సెల్: 9154388964, ఇన్‌స్పెక్టర్ స్వామి సెల్: 9154388965లపై సంప్రదించాలని సూచించారు.

20న సార్వత్రిక సమ్మె



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని ఏఐటీయూసీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రిమ్స్ కృష్ణ ఏజెన్సీ సూపర్‌వైజర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను ప్రభుత్వం రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా తీసుకురావడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. దేశ వ్యాప్త సమ్మెలో శానిటేషన్ సిబ్బంది, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ గార్డులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇందులో సంఘం నాయకులు చందు, రమేశ్, సంగీత, పద్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కోపా, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక పద్ధతిన 11 నెలల పాటు పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 6లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీటెక్, డిప్లొమా, ఐటీఐ, సీటీఐ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని, ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

సీఎస్‌ను కలిసిన అరుణ్‌కుమార్



సీఎస్‌కు పూలమొక్క అందజేస్తున్న అరుణ్‌కుమార్

బోథ్: తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్య కార్యదర్శిగా నియమితులైన కె.రామకృష్ణారావును ఏఐసీసీ తెలంగాణ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్‌కుమార్ శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన సీఎస్‌కు జిల్లాపై అవగాహన ఉందన్నారు. జిల్లా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.

గండం గట్టెక్కేనా..



ఇది నార్నూర్ మండలంలోని బలాన్‌పూర్ గ్రామంలోని చెరువు. నెల రోజుల క్రితమే ఎండిపోయింది. ఇటీవల పూడికతీత పనులు మొదలుపెట్టారు. ఈ ఏడాది ఎండల తీవ్రత కారణంగా చాలా చెరువులు ఏప్రిల్‌లోనే ఎండిపోయిన పరిస్థితులు కనిపించాయి.



ఇది సిరికొండ మండల కేంద్రంలోని చిక్‌మాన్ ప్రాజెక్ట్. ఈ ఏడాది ఎండల తీవ్రత కారణంగా ఇది పూర్తిగా ఎండిపోయింది. 2004లో నిర్మించిన ఈ చెరువు ఇప్పటివరకు ఎప్పుడు ఎండిపోలేదు. తొలిసారిగా ఎండిపోవడంతో దీని కింద ఉన్న 2వేల ఎకరాల ఆయకట్టుకు యాసంగిలో నీళ్లు అందని పరిస్థితి.

- జిల్లాలో పడిపోతున్న భూగర్భజలాలు
- ఇచ్చోడలో 30మీటర్ల లోతులోకి..
- పలుచోట్ల పనిచేయని బోర్లు
- ఇబ్బందులు పడుతున్న జనం
- జూన్ వర్షాలపైనే ఆశలు

జిల్లాలో సగటున భూగర్భ జలాల పరిస్థితి
(భూఉపరితలం నుంచి లోతులోకి.. మీటర్లలో)

జనవరి	: 7.06
ఫిబ్రవరి	: 8.54
మార్చి	: 8.68
ఏప్రిల్	: 8.82

ఏప్రిల్ నెలలో వివిధ ప్రాంతాల్లో భూగర్భ జలాల పరిస్థితి (మీటర్లలో)

ఇచ్చోడ	: 30.05
గాదిగూడ	: 18.35
గుడిహత్నూర్	: 14.50
భోరజ్	: 14.10
ఇంద్రవెల్లి	: 13.10
యాపల్‌గూడ	: 10.50
ఆదిలాబాద్	: 10.50

సాక్షి,ఆదిలాబాద్: ఇచ్చోడలోని విద్యానగర్, సుభాష్‌నగర్, టీచర్స్ కాలనీల్లో నీటి ఇక్కట్లు నెలకొన్నాయి. పలు ఇళ్లలో బోర్లలో నుంచి నీరు సరిగా రావడం లేదు. దీంతోస్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోర్లు కనీసం 15నిమిషాలకు మించి నడవడం లేదని పేర్కొంటున్నారు. గత్యంతరం లేక పలువురు ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. మరికొందరు ద్విచక్రవాహనాలపై సమీపంలోని వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. ఈ మండలంలో జనవరిలో 8.10 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా, ఫిబ్రవరికి ఏకంగా 28.85 మీటర్ల లోతులోకి పడిపోయాయి.తాజాగా 30మీటర్ల లోతుకంటే అధికంగా నమోదవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

30 మీటర్ల లోతునకు..

జిల్లాలో భూగర్భ జలాలు రోజురోజుకు మరింత పడిపోతున్నాయి. వేసవిలో ఎండల తీవ్రత పెరగడంతో కఠిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఇచ్చోడలో భూగర్భ జలాల పరిస్థితి తీవ్రంగా ఉంది. ఏకంగా 30 మీటర్ల లోతునకు పడిపోయాయి. ఇక్కడ ఇళ్లలో బోర్లు పావుగంట మించి నడవని పరిస్థితి. దీంతో స్థానికుల ఇక్కట్లు వర్ణనాతీతంగా మారాయి. ఇక ఆదిలాబాద్ పట్టణంలో 10 మీటర్ల లోతులోకి చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలో ప్రస్తుతం కొంత పర్వాలేదనుకున్నా ఈనెల చివరిలో మరింత లోతులోకి పడిపోయే పరిస్థితులు ఉన్నాయి. దీంతో నీటి సమస్య తీవ్రమవుతుందా అనే పట్టణవాసుల్లో కనిపిస్తుంది.

ఇదీ పరిస్థితి..

గతేడాది మే నెలలో జిల్లాలో భూగర్భలాలు 10.59 మీటర్లకు పడిపోయాయి. దీంతో తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఏడాది ఏప్రిల్ వరకే ఆ పరిస్థితి కనిపించింది. ప్రస్తుత మే నెలలో పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే చాలా చోట్ల చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. నెర్రెలు బారి దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల పూడిక తీత పనులు చేపడుతున్నారు. గతేడాది వర్షాకాలం ముగిసిన తర్వాత జిల్లాలో నవంబర్ నెలలో 5.14 మీటర్ల లోతులోనే జలాల లభ్యత కనిపించింది. ఈ నేపథ్యంలో జూన్ వర్షాలపైనే జిల్లావాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

వర్షాలు పడితేనే రీచార్జ్



సమయానికి వర్షాలు కురువని పక్షంలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి వెళ్లిపోయే పరిస్థితి ఉంది. బోర్లు ఎండిపోతున్నాయి. మళ్లీ మంచి వర్షాలు పడినప్పుడే రీచార్జ్ అవుతాయి. ప్రజలు నీటిని పొదుపుగా వాడాలి.

– శ్రీవల్లి, భూగర్భజల అధికారి, ఆదిలాబాద్

‘నీట్’ పకడ్బందీగా నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

- కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్: నీట్‌ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. ఈనెల 4న నిర్వహించనున్న పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఆయా కేంద్రాలను ఎస్పీతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 4న మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, ప్రభుత్వ బాలికల పాఠశాల, ప్రభుత్వ ఆర్ట్స్‌అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల, బంగారుగూడ మోడల్ స్కూల్, తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్‌లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షకు 1,659 మంది హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు కేంద్రంలోనికి అనుమతించనున్నట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో తాగునీరు, వైద్యసేవలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఇందులో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, కేంద్రీయ విద్యాలయం కోఆర్డినేటర్ అశోక్, వాగ్మారే, ఎంఈవోలు ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. 400 మంది సిబ్బంది వారి కుటుంబీకులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఇందులో డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మురళి, నవీన్‌కుమార్, కార్తీక్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే షీటీంలు

మహిళల భద్రత కోసం షీటీం నిర్వహణ చేపడుతున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో షీటీంలకు సంబంధించిన వివరాలను శుక్రవారం వెల్లడించారు. జిల్లాలో విస్తృతంగా షీటీం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గతనెలలో 110 గ్రామాలను ఆయా బృందాలు సందర్శించాయని పేర్కొన్నారు. నాలుగు ఎఫ్ఐఆర్, 10 పీటీ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆపత్కాల సమయంలో షీటీం కోసం 8712659953 నంబర్‌పై సంప్రదించాలని సూచించారు.

వీడీసీల అక్రమాలపై ఉక్కుపాదం..

వీడీసీల అక్రమ కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని ఎస్పీ అన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, అక్రమ దందాలు, వసూళ్లు, సెటిల్‌మెంట్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రభుత్వ యంత్రాంగాన్ని సంప్రదించాలని తెలిపారు. వీడీసీ బాధితులు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. చట్టం చేయాల్సిన పనిని పలుచోట్ల వీడీసీలు తమ చేతిలోకి తీసుకొని పోలీసు, న్యాయస్థానాన్ని ఆశ్రయించకుండా చూస్తున్నారని, వారు చెప్పింది వినకపోతే కొందరు గ్రామాల నుంచి వెలివేస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇలాంటి వాటిపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఐదు కేసులు నమోదు చేసినట్లు వివరించారు. బేల, జైనథ్, బోథ్, ఇచ్చోడ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు తెలిపారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్పీ

వేసవి శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజన విద్యార్థులు వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో గల క్రీడామైదానంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ, వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకుని క్రీడా సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. ఇటీవల స్కోచ్ అవార్డు అందుకున్న పీవోను అధికారులు, పీడీలు, క్రీడా పాఠశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డీడీ అంబాజీ, ఏసీఎంవో జగన్, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, గిరిజన క్రీడాధికారి పార్థసారథి తదితరులున్నారు.



హాజరైన విద్యార్థులతో పీవో ఖుష్బూ గుప్తా

ఆర్టీసీలో ఐఎన్‌టీయూసీ జెండా ఎగరేయాలి

ఆదిలాబాద్: రానున్న ఆర్టీసీ ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ జెండా ఎగురవేయాలని యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సయ్యద్ మహమూద్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ జక్కుల మల్లేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన ఆర్టీసీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులు కాకుండా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు యూనియన్ ముఖ్య పదవుల్లో ఉండాలని సూచించారు. యూనియన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా తీర్మానించి ఈనెల 7నుంచి ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మెకు మద్దతు తెలుపవద్దని తీర్మానించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనకు సానుకూలంగా స్పందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం యూనియన్ జాతీయ అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు దేవిదాస్‌చారి, పార్టీ పట్టణ అధ్యక్షుడు నగేష్, ఆర్టీసీ ఐఎన్‌టీయూసీ నాయకులు సురేందర్, భాస్కర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతూ మల్లేశ్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

బోథ్: మండలంలోని మర్లపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. మల్లెపూల శ్రీజ, జాదవ్ శారద, కదం నిఖిత శనివారం నుంచి జగిత్యాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నట్లు ప్రధానోపాధ్యాయులు హన్మాండ్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

దళారీ వ్యవస్థ అరికట్టాలి

ఇంద్రవెల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో దళారీ వ్యవస్థ లేకుండా జాగ్రతలు తీసుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు జొన్నలు కొనుగోలు చేసి ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో బినామీ రైతుల పేరిట విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఆయన వెంట రైతులున్నారు.




కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బొర్రన్న

ప్యూరిఫైడ్ దందా!



ఇక్కడ కనిపిస్తున్న వాటర్ ప్లాంట్ ఆదిలాబాద్‌లోని విద్యానగర్ లోనిది. ఈ యజమాని మరో చోట నుంచి వాహనంలో నీటిని తీసుకొచ్చి ఇక్కడ డంప్ చేస్తున్నాడు. ప్యూరిఫైడ్ చేయకుండానే ప్రజలకు విక్రయిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. 20 లీటర్ల క్యాన్‌కు రూ.30 చొప్పున వసూలు చేస్తున్నాడు.



ఇక్కడ కనిపిస్తున్న వాటర్ ప్లాంట్ ఆదిలాబాద్‌లోని కొత్త కుమ్మర్‌వాడ సమీపంలోనిది. ఇక్కడి నుంచి రోజుకు వందలాది క్యాన్లు సరఫరా అవుతున్నాయి. అయితే రోజుకు 4వేల లీటర్ల నీటిని బోరు నుంచి తోడితే ఇందులో 25 శాతం మాత్రమే ప్యూరిఫైడ్ అవుతుంది. మిగతా 75 శాతం వృథా అవుతుంది. ఇలా నీటి వృథాతో కాలనీలోని ఇళ్లలో ఉన్న బోర్లకి నీరు రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. జిల్లా కేంద్రంలో గల్లీకి ఒకట్రెండు చొప్పున ఇలా ప్లాంట్లు అక్రమంగా వెలిసినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

- అనుమతి లేకుండా వాటర్ ప్లాంట్లు
- నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు
- క్యాన్లలో అపరిశుభ్ర నీరే సరఫరా
- చోద్యం చూస్తున్న అధికారులు



ఆదిలాబాద్‌లోని ఓ వాటర్ ప్లాంట్ నిర్వహణ తీరిలా..

నిబంధనలు ఇవి..

- వాటర్ ప్లాంట్‌కు మున్సిపల్/గ్రామపంచాయతీ అనుమతి తీసుకోవాలి.
- పరిశ్రమల శాఖ నుంచి పార్టు–1 లైసెన్సు పొందాలి.
- నిర్వహణకు బీఎస్ఐ అనుమతి ఉండాలి. ఐఎస్ఐ నిబంధనలు పాటించాలి.
- ప్లాంట్‌లో మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ సిబ్బంది తప్పనిసరిగా ఉండాలి.
- పీహెచ్ స్థాయి 7 కంటే తగ్గకుండా చూడాలి. తగ్గితే ఆ నీరు తాగిన వారికి కిడ్నీ సంబంధిత సమస్యలు వస్తాయి.
- ప్లాంట్‌లో ప్రయోగశాలతో పాటు ఆవరణ పరిశుభ్రంగా ఉండాలి.
- నీటిని సరఫరా చేసే క్యాన్ అపరిశుభ్రంగా ఉండకూడదు. ప్రతిరోజు పొటాషియం పర్మాంగనేట్‌తో క్లీనింగ్ చేయాలి. అలాగే ప్రతి క్యాన్‌పై శుద్ధి చేసిన తేది, బ్యాచ్ నంబర్ ఉండాలి.
- శుద్ధి చేసిన నీటిని 304 గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేసిన పెద్ద ట్యాంకులో నింపి ఓజోనైజేషన్ చేయాలి.

అయితే జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క ప్లాంట్‌లో కూడా ఈ నిబంధనలు పాటించడం లేదు.

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ప్యూరిఫైడ్ వాటర్ పేరిట ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వేసవి కావడంతో నీటి దందా జోరందుకుంది. అయితే వీటికి అనుమతులు ఉండవు.. ప్రమాణాలు పాటించరు.. నిర్వహణ సైతం ఇష్టారీతిన కొనసాగుతోంది. రక్షిత నీటిని తాగాలనే ప్రజల బలహీనతను ఆసరాగా చేసుకుని ప్యూరిఫైడ్ పేరిట ఏటా లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు కొందరు. ప్రజలకు క్యాన్లలో కలుషిత నీటిని అందిస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ‘మామూలు’గా వ్యవహరించడం గమనార్హం.

నీటి నిర్ధారణ పరీక్షలు చేయకుండానే...

జిల్లాలో సుమారు 700 వరకు వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో ఏ ఒక్కదానికి కూడా అనుమతి లేదు. ఐఎస్ఐ నిబంధనలు సైతం పాటించడం లేదు. ఏడాదికోసారి రెన్యూవల్ చేసుకోవాల్సి ఎక్కడా అలాంటి దాఖలాలు కనిపించడం లేదు. ఇళ్లు, దుకాణాలు, పాత గదుల్లోనే ప్లాంట్లను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారు. నిర్ధారణ పరీక్షలు సైతం ఎక్కడా నిర్వహించడం లేదు. ఏటా వేసవిలో ప్యూరిఫైడ్ నీటికి గిరాకీ ఉంటుంది. వీటిని ఆసరాగా చేసుకుని కొందరు అనుమతి లేకుండా ప్లాంట్లను నిర్వహిస్తున్నారు. గతంలో పట్టణాలకు పరిమితం కాగా ప్రస్తుతం గ్రామాలకు సైతం విస్తరించాయి. క్యాన్‌కు రూ.20 నుంచి రూ.40 వరకు వసూలు చేస్తున్నారు. వాస్తవంగా 20 లీటర్ల నీటి శుద్ధికి రూ.2 నుంచి రూ.3 మాత్రమే ఖర్చవుతుంది. ఈ క్రమంలో ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువగా ఉన్న ఈ వ్యాపారం వైపు మొగ్గుచూపుతున్నారు. కొన్ని ప్లాంట్లలో క్యాన్లు శుద్ధి చేయకుండానే సాధారణ నీటిని నింపి సరఫరా చేస్తున్నారు. కాలం చెల్లిన క్యాన్లు ఉపయోగించడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

అనుమతి లేని ప్లాంట్లపై చర్యలు

జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను తనిఖీ చేస్తాం. అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించని వాటిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– సీవీఎస్ రాజు, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌కు రాజీనామా

మంచిర్యాలఅర్బన్: టీజీఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆదిలాబాద్ రీజియన్ కార్యదర్శి పదవికి భీమేశ్వర్‌రావు శుక్రవారం రాజీనామా చేశారు. గతంలో కార్మికుల సమ్మె తర్వాత వారి అనేక సమస్యలపై యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో యూనియన్ రాష్ట్ర నాయకత్వం విఫలమైందని ఆరోపించారు. సమస్యలపై నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శికి రాజీనామా లేఖను పంపినట్లు పేర్కొన్నారు.

బాసరలో భక్తుల రద్దీ



క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. శుక్రవారం వేకువజామున పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు అనంతరం నది ఒడ్డున శివాలయంలో భక్తులు పూజలు చేశారు. అక్షరాభ్యాస మండపంలో తల్లిదండ్రులు చిన్నారులకు అక్షర శ్రీకారం, కుంకుమార్చన పూజలు చేయించారు. అనంతరం శ్రీ జ్ఞాన సరస్వతి, మహాంకాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

గోదావరికి హారతి



హారతి ఇస్తున్న వేద పండితులు

బాసర: బాసరలో గోదావరి నదికి శుక్రవారం హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ వేద భారతి పీఠం, గ్రామస్తుల ఆధ్వర్యంలో గోదారమ్మ తల్లికి పూజలు చేశారు. వేద పాఠశాల విద్యార్థులు పంచ, నాగ హారతిని ఇచ్చారు. వేద విద్యానంద గిరిస్వామి, భక్తులు తదితరులు ఉన్నారు.

ఆటో దగ్ధం



దగ్ధమైన ఆటో

బాసర: బాసర ట్రిపుల్ ఐటీ వద్ద శుక్రవారం ఆటోలో మంటలు చెలరేగి దగ్ధమైంది. భైంసా పట్టణానికి వెళ్తున్న ఆటోలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో డ్రైవర్ తప్పించుకున్నాడు. ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అటుగా వెళ్తున్న కొందరు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎండ తీవ్రత వల్ల ప్రమాదం సంభవించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

కెమెరాలో వన్యప్రాణులు

జన్నారం: వన్యప్రాణుల గణనలో భాగంగా ఇందన్‌పల్లి అటవీ రేంజ్ పరిధిలో ఇటీవల కెమెరాలు అమర్చారు. ఇందులో అనేక వన్యప్రాణులు కనిపించినట్లు రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో అమర్చిన కెమెరాలో అడవి దున్నలు, నీలుగాయిలు, చుక్కల దుప్పలు, నెమళ్లు చిక్కాయి. అత్యధికంగా చుక్కల దుప్పలు పిల్లలతో కనిపించినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.



తల్లితో చుక్కల దుప్పి పిల్ల



నెమలి



చుక్కల దుప్పి



అడవి దున్న

కలియదున్నితే భూసారం

- వరి కొయ్యలు కాల్చితే కాలుష్యం
- దిగుబడిపై ప్రభావం



ధర్మోరలో వరి కొయ్యలకు నిప్పుపెట్టడంతో కాలిన పైపులు

లోకేశ్వరం: వరి కోతలు పూర్తవుతున్నాయి. వానాకాలం సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. పొలాన్ని దుక్కి దున్నడానికి అడ్డంగా ఉన్న వరి కొయ్యలను కాల్చడంలో నిమగ్నమయ్యారు. కొయ్యలు తగలబెడితే వెలువడే పొగతో వాతావరణ కాలుష్యంతోపాటు భూసారం దెబ్బతింటుంది. సూక్ష్మపోషకాలు నశిస్తాయి. పంట దిగుబడిపై ప్రభావం చూపుతుంది. భవిష్యత్తులో సేద్యం కష్టమవుతుంది. ఈ విపత్తును తప్పించడానికి రైతులంతా కొయ్యలను కలియదున్ని సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వ్యవసాయ ఆధారితమైన జిల్లాలో యాసంగి సీజన్ పూర్తికానుంది. జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. రైతులు యంత్రాలతో కోతలు చేపట్టారు. పొలాల్లో వరి కొయ్యలతోపాటు పంట వ్యర్థాలు మిగిలిపోయాయి. వీటిని తొలగించి పొలాన్ని దుక్కి దున్నడానికి కొయ్యలను తగలబెడుతున్నారు. కలియదున్నాలంటే చాలా సమయం పడుతుందని, ఖర్చుతో కూడుకుందని భావిస్తున్నారు. ఒక్కసారి మంట అంటిస్తే గంటలో కాలిపోతుందనే ఆలోచనలో ఉన్నారు. ఈనేపథ్యంలో రైతులకు వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

ఉపయోగాలు..

- కలియ దున్నడంతో వరికొయ్యలు మట్టిలో కలిసిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుంది.
- నత్రజని, భాస్వరం, సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయి.
- సేంద్రియ కర్బన్ శాతం పెరుగుతంది.
- భూసారం పెరిగితే యాసంగిలో వాడే ఎరువులను 30 నుంచి 40 శాతం తగ్గించుకోవచ్చు.
- వానపాములు పెరిగి భూమి సారవంతమవుతుంది.

ఇలా చేయాలి..

- పొలాన్ని రోటవేటర్‌తో కలియదున్నాలి. వరి కొయ్యలు చిన్నచిన్న ముక్కలుగా మారుతాయి.
- దుక్కికి నీళ్లు పెట్టి ఎకరాకు 100 గ్రాముల సింగిల్ సూపర్ పాస్ఫేట్ చేసి 15 నుంచి 20 రోజులు పొలాన్ని నానబెట్టాలి.
- కొయ్యలు పూర్తిగా కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారుతాయి.

నష్టాలు..

- వరికొయ్యలను కాలిస్తే భూసారం దెబ్బతింటుంది. తేమను కలిగి ఉండే మట్టి తన సహజగుణాన్ని కోల్పోతుంది.
- నేలలో సహజసిద్ధంగా ఉండే సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు నశిస్తాయి.
- నత్రజనిలాంటి పోషక పదార్థాలు క్షీణిస్తాయి.
- కొన్నేళ్లుగా భూసారమంతా తగ్గిపోవడంతో సాగుకు పనికి రాకుండా పోతుంది.
- కాల్చడంతో వచ్చే దట్టమైన పొగతో రైతు ఆరోగ్యం దెబ్బతింటుంది.
- మంటలు పెద్దవైతే పక్కనే గల ఇతర పంటలు వస్తువులు కాలిపోతాయి.

కాల్చడం మానేశాను



గతంలో అవగాహన లేక వరికొయ్యలను కాల్చేవాళ్లం. వ్యవసాయాధికారుల సూచనతో మానేశాం. ఇప్పుడు దుక్కితో దున్నేసి సేంద్రియ ఎరువుగా మార్చుకుంటున్నాం. భూసారం పెరుగుతోంది. పంటకు అవసరమైన పోషకాలు దొరుకుతున్నాయి.

– మామిడి సునీల్‌రెడ్డి, ధర్మోర రైతు

అవగాహన కల్పిస్తున్నాం



వరి కొయ్యలు కాల్చవద్దని రైతులకు సూచిస్తున్నాం. దీని వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నాం. అవగాహన ఉన్నవారు కలియదున్ని సేంద్రియ ఎరువుగా మార్చుకుంటున్నారు.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, నిర్మల్

డిగ్రీ ప్రవేశాలకు వేళాయె..

- నేటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం
- మూడు విడతల్లో ప్రవేశాలు

బోథ్: తెలంగాణలో డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈమేరకు ఉన్నత విద్యామండలి శుక్రవారం వివరాలు వెల్లడించింది. ప్రవేశాల ప్రక్రియను మూడు విడతల్లో పూర్తి చేయనుంది. ఆన్‌లైన్ ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరానికి సంబంధించిన సీట్లు భర్తీ చేయనుంది. శనివారం నుంచి విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్, మీసేవా, టీ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 91 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.

కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి

ఫస్ట్ ఫేజ్‌లో సీట్లు పొందే విద్యార్థులు మే 30 నుంచి జూన్ 6లోపు కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. రెండు, మూడు విడతలో సీట్లు పొందే వారు ఆయా కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. అలా చేయకపోతే సీటు రద్దవుతుంది. ఫస్ట్ సెమిస్టర్ తరగతులు జూన్ 30 నుంచి ప్రారంభమవుతాయి.

రిజిస్ట్రేషన్లు ఇలా..

- ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం కోసం దోస్త్ వెబ్‌సైట్‌లో www.dost.cgg.gov.in రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. కళాశాలలను ఎంచుకోవాలి. ఇంటర్‌లో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. సీట్లు మిగిలితే స్పెషల్ ఫేజ్ నోటిఫికేషన్లు వస్తాయి. వీటిపై ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుంటుంది.
- దోస్త్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా డిగ్రీ అడ్మిషన్ల అప్‌డేట్స్ తెలుసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ల ఫీజుతోపాటు వెబ్ ఆప్షన్లు, సీట్ల కేటాయింపు, అలాట్‌మెంట్ కాపీలు పొందటం వంటి ప్రక్రియలు పూర్తి చేసుకోవచ్చు.

ప్రవేశాలు ఇలా..

- డిగ్రీలో మూడు విడతల ద్వారా ప్రవేశాలకు అవకాశం.
- మొదటి ఫేజ్‌లో భాగంగా నేటి నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. రూ.200 ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 21వ తేదీ తుది గడువు. ఈనెల 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. 29న మొదటి ఫేజ్ సీట్ల కేటాయింపు ఉంటుంది.
- రెండోవిడత కింద ఈనెల 30 నుంచి జూన్ 8 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. 13న సీట్ల కేటాయింపు ఉంటుంది.
- మూడో విడత ప్రక్రియ జూన్ 13 నుంచి షురూ అవుతుంది. జూన్ 19 తుది గడువుగా నిర్ణయించింది. జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు, 23న సీట్ల కేటాయింపు ఉంటుంది.

ఉత్తీర్ణత సాధించేలా తరగతులు నిర్వహించాలి



అధ్యాపకులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్

ఇంద్రవెల్లి: ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఇంటర్ బోర్డు రాష్ట్ర పరిశీలకుడు వెంకటేశ్వర్ అన్నారు. మండలంలోని లింమ్‌గూడలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థుల వివరాలు, ప్రత్యేక తరగతుల నిర్వహణ, ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. మే నెల పూర్తిగా అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఇంటర్ బోర్డు నిబంధనలపై నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ మారుతి, అధ్యాపకులు మధుకర్, ప్రమీల, దళిత్ తదితరులు ఉన్నారు.

ఆర్టీఐ పేరిట డబ్బులు డిమాండ్

- ముగ్గురి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పాఠశాలపై ఆర్టీఐ వేసి డబ్బులు డిమాండ్ చేసిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని విద్యానగర్‌లో చాణక్య పాఠశాలకు సంబంధించి భుక్తాపూర్‌కు చెందిన ఎండీ అర్షద్, షేక్ సమద్, తాటిగూడకు చెందిన షేక్ యూసుఫ్‌లు ఆర్టీఐ వేశారు. పాఠశాల యజమాని, మైనార్టీ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అమీరొద్దీన్ ఆ ముగ్గురిని ఆర్టీఐ వివరాలు ఇస్తానని ఇటీవల పిలిచాడు. తమకు ఆర్టీఐ వివరాలు వద్దని, తాము (ఐయూఎంఎల్) ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ ఏర్పాటు చేశామని, పార్టీ ఫండ్ రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేశారు. శుక్రవారం ఎండీ అర్షద్, షేక్ యూసుఫ్, షేక్ సమద్‌లను రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

జొన్నలేప తిని 20 ఆవులు మృతి



ఆవులకు చికిత్స అందిస్తున్న పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్

బజార్‌హత్నూర్: మేతకు వెళ్లిన ఆవులు జొన్న లేప తిని మృత్యువాతపడ్డాయి. మండలంలోని బుర్కపల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్ కథనం ప్రకారం.. గ్రామంలో 45 ఆవులు శుక్రవారం పశుగ్రాసం మేయడానికి వెళ్లాయి. పంట చేనులో జొన్న లేప (కోత తర్వాత జొన్న కాండానికి మొలిచిన మొలకలు) తిని 20 ఆవులు మృతిచెందాయి. మిగతా ఆవులకు సకాలంలో వైద్య చికిత్స అందించడంతో ప్రాణాలతో బయటపడ్డాయి. విషయం తెలుసుకున్న ఎంఆర్ఐ నూర్‌సింగ్, ఏఎస్సై లింబాజీ ఘటనస్థలానికి చేరుకుని మృతిచెందిన ఆవులను పరిశీలించారు. కాగా బర్దవల్ నానక్‌సింగ్‌కు చెందిన 3 ఆవులు, టాక్ల నానక్‌సింగ్ 4, హూషార్‌సింగ్ 2, కపూర్‌చంద్ 2, గులాబ్ సింగ్, గురువేసింగ్, చందర్‌సింగ్, న్యాల్‌సింగ్, సుభాష్, బాన్య రామ్, బామన్ పరుశురాం, హరిసింగ్, గోపిచంద్‌లకు చెందిన ఒక్కొక్క ఆవులు మృతి చెందాయి.

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఇద్దరు వేర్వేరు కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య కాపురానికి రావడం లేదని భర్త ఉరేసుకున్నాడు. మద్యానికి బానిసైన యువకుడు ఆర్థిక ఇబ్బందులతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

భార్య కాపురానికి రావడం లేదని..



రవికిరణ్ మృతదేహం

తానూరు: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని మహలింగి గ్రామానికి చెందిన బన్సోడే రవికిరణ్ (34)కు ముథోల్ మండలం సరస్వతినగర్‌కు చెందిన జ్యోతితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఇప్పటివరకు సంతానం కలగడం లేదని బాధతో రవికిరణ్ మద్యానికి బానిసయ్యాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గతేడాది జ్యోతి సరస్వతినగర్‌కు వెళ్లింది. అప్పటి నుంచి తండ్రి సుభాష్‌తో రవికిరణ్ ఉంటున్నాడు. ఈ క్రమంలో భార్య కాపురానికి రాకపోవడం, ఒంటరి జీవితం భరించలేక తీవ్ర మనస్తాపంతో గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. శుక్రవారం ఉదయం తండ్రి గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ట్రెయినీ ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..



దుర్గాప్రసాద్ మృతదేహం

మంచిర్యాలక్రైం: మంచిర్యాల, రవీంద్రఖని రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. తీగల్‌పహాడ్‌కు చెందిన పైడి దుర్గా ప్రసాద్ (28) మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపం చెందాడు. జీవితంపై విరక్తితో శుక్రవారం ఉదయం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి శంకరమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై తెలిపారు.


గల్ఫ్ కార్మికుడి ఆచూకీ కోసం వినతి



ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న కుటుంబీకులు, నాయకులు

ఖానాపూర్: మండలంలోని గోడలపంపు గ్రామానికి చెందిన సింగం రాజేశ్వర్ ఉపాధి నిమిత్తం ఆరేళ్ల క్రితం సౌదీ అరేబియాకు వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న ఆయన రెండేళ్లుగా ఎలాంటి సమాచారం లేకుండా పోయింది. కుటుంబీకులు, టీపీసీసీ రాష్ట్ర మహిళా నాయకురాలు అల్లూరి కృష్ణవేణి ప్రత్యేక చొరవతో శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వద్ద ప్రవాసీ ప్రజావాణిలో కేంద్రం ఇన్‌చార్జి అమరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గల్ఫ్ కార్మికుడి ఆచూకీ కనుగొని వెంటనే ఇండియాకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కుటుంబీకులతో కలిసి విన్నవించారు. కాంగ్రెస్ మహిళా నాయకురాలు రేఖాగౌడ్ తదితరులు ఉన్నారు.

ఇంట్లో చోరీ



సీసీ ఫుటేజీలో గుర్తుతెలియని వ్యక్తి

బాసర: మండలంలోని టాక్లి గ్రామంలోని గిరిజనవాడలో శుక్రవారం వేకువజామున దావనే గంగాధర్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూ.30 వేల నగదు, తులం బంగారం వస్తువులను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గంగాధర్ ఇంటి పక్కన ఉన్న జారీకొట్ బాబురావు ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలో గుర్తుతెలియని వ్యక్తులు చిక్కారు. వీరిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో కత్తులతో పోస్టు

- మహిళపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఇన్‌స్టాగ్రామ్‌లో కత్తులతో పోస్టుచేసిన మహిళపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్‌రూరల్ సీఐ ఫణిధర్ తెలిపారు. మావల పోలీసుస్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి చెందిన పతంగె స్వప్న ఇన్‌స్టాగ్రామ్‌లో కత్తులతో పోస్టు చేయడంపై పోలీసులు సుమోటోగా తీసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

లక్సెట్టిపేట వరకు జాతీయ రహదారి పొడిగించాలి

- జన్నారం మండల అభివృద్ధి కమిటీ నాయకులు
- ఎంపీ గోడం నగేశ్‌కు వినతి



ఎంపీ నగేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న మండల అభివృద్ధి కమిటీ నాయకులు

జన్నారం: జాతీయ రహదారిని కడెం, జన్నారం, దండేపల్లి మీదుగా లక్సెట్టిపేట వరకు పొడిగించేలా చూడాలని జన్నారం మండల అభివృద్ధి కమిటీ నాయకులు కోరారు. శుక్రవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముంబయి నుంచి నిర్మల్ మీదుగా ఖానాపూర్ వరకు ఉన్న జాతీయ రహదారిని అటవీ అనుమతులు తీసుకుని కడెం, జన్నారం, దండేపల్లి మీదుగా లక్సెట్టిపేట వరకు పొడిగించాలని కోరినట్లు తెలిపారు. కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈనెల 5న ఆదిలాబాద్‌కు వస్తున్నారని, ఆయన దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. లక్సెట్టిపేట నుంచి జన్నారం మీదుగా రహదారుల గుండా వాహనాల రాకపోకలపై అటవీశాఖ ఆంక్షలు ఎత్తివేసి, రాకపోకలను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా జన్నారంలో 30 పడకల ఆసుపత్రి మంజూరు చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ విన్నవించినట్లు తెలిపారు. జన్నారం అభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీరాముల కొండయ్య, కో కన్వీనర్ కోడూరి చంద్రయ్య, బీసీ సంఘం అధ్యక్షులు గూడ అశోక్, పెరక సంఘం అధ్యక్షులు ఎంబడి సత్తన్నతోపాటు మేనేని శ్రీనివాస్ రావు, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు షబ్బీర్ పాషా, మైనార్టీ నాయకులు షేక్ అక్బర్ పాల్గొన్నారు.

వీహబ్ ప్రతినిధులతో చర్చ



కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర: విద్య, పరిశోధన, సాంకేతిక రంగాలతోపాటు మహిళలకు స్వయం ఉపాధి కోసం పరస్పర సహకారం అందించేందుకు బాసర ఆర్జీయూకేటీ, వీహబ్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయు)పై చర్చలు జరిగాయి. బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ సమక్షంలో వీహబ్ ప్రతినిధులు, ఓఎస్డీ, ఏవోలతో చర్చించారు. ఈ ఒప్పందం ద్వారా విద్య మౌలిక సదుపాయాలు, పరిశోధనకు ప్రోత్సాహం, శిక్షణలు, ఇంటర్న్‌షిప్‌లు, సంయుక్త ప్రాజెక్టులు వంటి అవకాశాలు మెరుగవుతాయని ఇన్‌చార్జి వీసీ తెలిపారు. హైదరాబాద్‌లో ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, వీహబ్ ప్రతినిధుల మధ్య అవగాహన ఒప్పందం జరగనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ దిల్బార్, అసోసియేట్ డీన్, ప్లేస్మెంట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

256 క్వింటాళ్ల జొన్నలు పట్టివేత



మాదపూర్‌లో జొన్నలు పట్టుకున్న పోలీసులు

ఇచ్చోడ: మండలంలోని మాదపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 256 క్వింటాళ్ల జొన్నలను ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు మాదపూర్‌లో శివారులో సజ్జద్ రేకులషెడ్డులో తనిఖీ చేయగా నిల్వ ఉన్న జొన్నలు లభ్యమయ్యాయి. ఆర్ఐ హుస్సేన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. పంచనామా నిర్వహించి అనుమానాస్పదంగా ఉన్న జొన్నలను సీజ్ చేసి వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జొన్నలు తరలిస్తున్న ట్రాలీ వాహనం..

ఇంద్రవెల్లి: అక్రమంగా జొన్నలను ట్రాలీ వాహనంలో తరలిస్తుండగా మండలంలోని హీరాపూర్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పట్టుకున్నట్లు వ్యవసాయ మార్కెట్, రెవెన్యూ అధికారులు తెలిపారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని ఏమాయికుంటకు చెందిన వ్యాపారి నారాయణ ట్రాలీలో జొన్నలు తరలిస్తున్నట్లు సమాచారం అందింది. చెక్‌పోస్ట్ వద్ద ట్రాలీ వాహనాన్ని తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న 45 క్వింటాళ్ల జొన్నలను సీజ్ చేశారు. ఆ జొన్నలను ప్రభుత్వ గోదాంలో భద్రపర్చగా, ట్రాలీ వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు.